www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 280 | గురువారం | 13- 03 - 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

## ఏలూరు జిల్లా ప్రత్యేక అధికారి గా ఆమ్రపాలి నియామకం



3

## కన్నతండ్రే కాటేశాడు



నరకం చూసిన మైనర్ బాలిక

తొలిఅడుగు, అమరావతి : నాన్న అంటే నడిచే దేవుడిలా భావిస్తారు పిల్లలు. ముఖ్యంగా ఆడపిల్లలకు తండ్రితో ఎంతో ఎమోషనల్ బాండింగ్ ఉంటుంది. కూతుర్ని ఓ ప్రిన్సెస్‌లా చూసుకునే నాన్నలు మనకు సమాజంలో ప్రతి చోటా కనిపిస్తూనే ఉంటారు. ఆకతాయిలు ఏడిపించినా.. చదువులు ఒత్తిడి వేధిస్తున్నా.. ఇలా భరించలేని ఏ సమస్య వచ్చినా నాన్నతోనే షేర్ చేసుకుంటారు కొందరు కుమార్తెలు. కానీ ఓ తండ్రే కూతురి పాలిట కాలకేయుడయ్యాడు. కన్నబిడ్డనే చెరిచాడు. తండ్రి ఆకృత్యం గురించి బయటకు చెప్పలేక.. పంటి బిగువన బాధను భరిస్తూ తల్లిడిల్లిపోయింది ఆ పాప. పాఠశాలలో ఆ అమ్మాయి ముభావంగా ఉండటాన్ని గమనించిన టీచర్.. ఏం జరిగిందని అడగ్గా.. జరిగిన దారుణాన్ని చెబుతూ

2

# ప్రతిపక్షాన్ని తిట్లతో కాదు..

# సబ్జెక్టుతో దెబ్బకొట్టాలి



- విపక్ష సభ్యుల గందరగోళంపై విప్‌లు స్పందించలేదేం?
- ఎమ్మెల్యేలు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలి
- ఇకపై అన్ని నియోజకవర్గాలకూ సమానంగా నిధులు
- సీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యలు

తొలిఅడుగు, హైదరాబాద్ : కొంతమంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీతో సత్సంబంధాలు కలిగి ఉండాలనుకుంటున్నట్లు నాకు సమాచారం వస్తోంది. అలా ఉంటే వచ్చే ఎన్నికల్లో మీపై ఆ పార్టీ పోటీ పెట్టదని అనుకుంటున్నారా? అలా ఉండడం వల్ల తాత్కాలికంగా ఇబ్బంది ఉండకపోవచ్చేమో గానీ.. భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అది మీ గెలుపోటములపైనా ప్రభావం చూపుతుంది" అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్ష పార్టీతో రాజకీయంగా ప్రత్యర్థులమనే భావనతో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు తమ వ్యవహారశైలి మార్చుకోవాలంటూ సున్నితంగా హెచ్చరించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సభలో అనుసరించాల్సిన వ్యూహాలు, వ్యవహరించాల్సిన తీరుపై చర్చించేందుకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్-1లో మంత్రులు, ఎమ్మెల్యేలతో కాంగ్రెస్

2

## నేపాల్ గొడవల్లో యూపీ సీఎం




తొలిఅడుగు డెస్క్ : పొరుగు దేశమైన నేపాల్‌లో యోగి ఆదిత్యనాథ్ గురించి తీవ్రంగా చర్చ నడుస్తోంది. దేశ రాజధాని ఖాట్మండు వీధుల్లోకి వేలాది మంది వచ్చి ఉత్తరప్రదేశ్ సీఎం చిత్రం ఉన్న పోస్టర్లను ప్రదర్శించారు. రాచరిక

2

## మీ మాట వినకుంటే

# నిధులు ఆపేస్తారా

- ఇలాంటి కేంద్రప్రభుత్వాన్ని చూడడం తమిళులకిదే ప్రథమం



తొలిఅడుగు, చెన్నై: ప్రజాస్వామ్య దేశంలో ఓ విద్యావిధానాన్ని ఆమోదించకపోతే నిధులను ఆపేస్తామంటూ బెదిరించే కేంద్ర ప్రభుత్వాన్ని తొలి సారిగా తమిళ ప్రజలు చూస్తున్నారని, త్వరలో వారికి తగిన గుణం పాఠం చెప్పేందుకు కూడా సిద్ధంగా ఉన్నారని ముఖ్య మంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. హిందీ, సంస్కృత భాషలను

2


## కేటీఆర్ కేసుపై తెలంగాణ హైకోర్టు విచారణ




తొలిఅడుగు, హైదరాబాద్ : మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. కేటీఆర్ గతేడాది తన అనుచరులతో కలిసి అనుమతులు లేకుండా మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శించారని, అలాగే డ్రోన్ ఎగరవేశారంటూ కేటీఆర్ సహా మరికొంతమందిపై కేసులు నమోదు అయ్యాయి. అయితే, ఇవాళ (బుధవారం) విచారణ సందర్భంగా.. ఎలాంటి ఆధారాలూ లేకుండా మహదేవ్‌పూర్ పోలీసులు కేటీఆర్‌పై కేసు నమోదు చేశారని ఆయన తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. డ్రోన్ ఎగురవేశారని అనడానికి ఎలాంటి సాక్ష్యాలూ లేవని ధర్మాసనం దృష్టికి

2


## ఏపీ ఈఏపీసెట్ 2025 నోటిఫికేషన్ విడుదల




తొలిఅడుగు, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్, అగ్రికల్చర్-ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వ హించనున్న ఏపీ స్టేట్ ఇంజనీరింగ్, అగ్రిక ల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2025 (ఈఏపీసెట్) నోటిఫికేషన్ విడుదలైంది. ఈ

2

## పోసానికి విడుదలపై సస్పెన్స్



తొలిఅడుగు, కర్నూలు : సినీనటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళి విడుదలపై సస్పెన్స్ నెలకొంది. న్యాయాధికారి ఎదుట పోసానిని సీఐడీ అధికారులు ఇవాళ(బుధవారం) హాజరుపరిచారు. వర్చువల్ విధానంలో జైలు నుంచి జరుగుతున్న వాదనలు వినిపించారు. న్యాయాధికారి రిమాండ్ విధిస్తే పోసాని కృష్ణమురళి బెయిల్‌పై విడుదల చేయడం ఆగిపోనుంది. రిమాండ్ విధించక పోతే పోసాని విడుదల అయ్యే అవకాశం ఉంది. పలు జిల్లాల్లో కేసులు నమోదు కావడంతో..బెయిల్‌పై విడుదలైనా మళ్లీ ఏదో ఒక

2

## భారత్-మారిషస్ మధ్య కీలక ఒప్పందాలు



తొలిఅడుగు, న్యూఢిల్లీ : ప్రధాని మోదీ మారిషస్ పర్యటన బిజీబిజీగా కొనసాగుతోంది. మారిషస్‌తో కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. మారిషస్ ప్రధాని నవీన్ చంద్ర రామ్ గులామ్‌తో కలిసి ఒప్పందాలపై సంతకాలు చేశారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. భారత, మారిషస్ రిజర్వ్ బ్యాంక్‌లు పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పాటు మారిషస్ పర్యటనకు వెళ్లారు. బుధవారం(మార్చి

2

## మహిళా జర్నలిస్టుకు 14 రోజుల రిమాండ్



తొలిఅడుగు, హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన మహిళా జర్నలిస్ట్ రేవతికి నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. రేవతితోపాటు బండి సంధ్యను పోలీసులు చంచల్ గూడ జైలుకు తరలించారు. వారిద్దరికీ ఈనెల 26 వరకూ రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. విచారణ

2

## రాష్ట్ర వైద్య విద్యను భ్రష్టు పట్టించారు

### జగన్‌పై మంత్రి మంత్రి సత్యకుమార్ యాదవ్ ఫైర్



తొలిఅడుగు, అమరావతి : మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఫైర్ అయ్యారు. జగన్‌ను అప్పుల రెడ్డి అని సంభోదిస్తూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నిప్పు లు చెరిగారు ఏపీ మంత్రి. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన అప్పుల రెడ్డి వైఎస్ జగన్.. రాష్ట్ర వైద్య విద్యను కూడా భ్రష్టు పట్టించారంటూ మండిపడ్డారు. జగన్ ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడం హాస్యాస్పదంగా

2

## నిజమేంటో తేల్చి చెప్పిన సౌందర్య భర్త



తొలిఅడుగు, హైదరాబాద్ : సినీ నటులు మంచు మోహన్ బాబు, సౌందర్య ఆస్తి వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో

3

# కేటీఆర్ కేసుపై తెలంగాణ హైకోర్టు విచారణ

మొదటిపేజీ తరువాయి

తీసుకెళ్లారు. ఉద్దేశపూర్వకంగానే కేసు పెట్టినట్లు అర్థం అవుతోందని అన్నారు. ఈ మేరకు నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను వెంటనే కొట్టివేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అయితే తెలంగాణ రాష్ట్రానికి మేడిగడ్డ ప్రాజెక్టు ఎంతో కీలకమని హైకోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. మేడిగట్ట బ్యారేజ్ నిషిద్ధ ప్రాంత జాబితాలో ఉందని, అనుమతి లేకుండా ప్రాజెక్ట వద్దకు వెళ్లి డ్రోన్ ఎగురవేశారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీని వల్ల డ్యాం భద్రతకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని పీపీ చెప్పుకొచ్చారు. ఇరువర్గాల వాదనలూ విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 18వ తేదీకి వాయిదా వేసింది. కాగా, మేడిగడ్డ కుంగిపోవడంపై గతేడాది పెద్దఎత్తున రాజకీయ రగడ చెలరేగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో బీఆర్ఎస్ నేతలతో కలిసి మాజీ మంత్రి కేటీఆర్ గతేడాది జులై 16న మేడిగడ్డ సందర్శనకు వెళ్లారు. కాగా, అప్పుడే డ్యాం పరిస్థితిని తెలుసుకునేందుకు డ్రోన్ ఎగరవేశారంటూ కేటీఆర్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు మహదేవ్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# నేపాల్ గొడవల్లో యూపీ సీఎం

మొదటిపేజీ తరువాయి

అనుకూల మాజీ రాజు జ్ఞానేంద్ర షా దేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో .. రాచరిక పాలనకు కావాలని కోరుతూ వేలాదిమంది రాజుతో పాటు యోగి చిత్రాన్ని ప్రదర్శిస్తూ గట్టిగా నినాదాలు చేశారు. దీంతో ఒక్కసారిగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి పేరు నేపాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉత్తరప్రదేశ్ సరిహద్దులో ఉన్న నేపాల్ రాజధాని ఖాట్మండు వీధుల్లో వేలాది మంది యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పోస్టర్లతో ర్యాలీ నిర్వహించారు. రాచరిక పాలన, హిందూ దేశాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ (ఆర్‌పీపీ) నిర్వహించిన ర్యాలీలో మాజీ రాజు జ్ఞానేంద్ర షాతో పాటు యోగి ఆదిత్యనాథ్ పోస్టర్లను కూడా ప్రదర్శించారు. అయితే, నేపాల్ రాజకీయాలకూ, యూపీ సీఎంకూ ఏంటి సంబంధం అని ఆలోచిస్తున్నారా.. నేపాల్‌ను మళ్ళీ హిందూ దేశంగా మార్చాలని జ్ఞానేంద్ర షా చాలా కాలంగా ప్రయత్నిస్తూ వస్తున్నారు. అందులో భాగంగా ఆయన వివిధ ప్రాంతాల్లో ప్రచారం చేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో భారత్‌ను సందర్శించిన సమయంలో యూపీ సీఎంతో భేటీ అయ్యి ప్రత్యేకంగా ముచ్చటించారు. దీని తర్వాత రాచరిక పాలనకు యోగి తన పూర్తి మద్దతు ప్రకటించారు.

నేపాల్ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఇక్కడ పెద్ద సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చి హిందూ రాచరికానికి అనుకూలంగా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. 2006లో చైనా అనుకూల మావోయిస్టు ఉద్యమం రాజు జ్ఞానేంద్ర పాలనకు ముగింపు పలికింది. అప్పటి నుంచి నేపాల్‌లో వామపక్షాలు పాలిస్తూ వస్తున్నాయి. పుష్పకమల్ దహల్ ప్రచండ తర్వాత కే.పీ.శర్మ ఓలి అధ్యక్ష బాధ్యతలను స్వీకరించారు. అయితే, తాజాగా రాచరికం తిరిగి రావాలని కోరుకునే వారి సంఖ్య అధికమవుతోంది. ఇటీవల మాజీ రాజు జ్ఞానేంద్ర షా పోఖారా నుండి ఖాట్మండు త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి బయటకు రాగానే షా మద్దతుదారులు అక్కడ భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ ర్యాలీలోనే కొంతమంది యువకులు రాజా జ్ఞానేంద్ర షాతో పాటు యోగి ఆదిత్యనాథ్, జాతీయ జెండా పోస్టర్లను చేత పట్టి మోటార్ సైకిళ్లపై ర్యాలీగా వెళ్లారు. ఇదిలా ఉంటే, యూపీ సీఎం యోగి ఫోటో ర్యాలీలో ప్రదర్శించడాన్ని ప్రధాన మంత్రి కేపీ ఓలి తప్పుపట్టారు.

# మీ మాట వినకుంటే నిధులు ఆపేస్తారా

మొదటిపేజీ తరువాయి

నిర్బంధంగా అమలు చేయడం, విద్యను ప్రైవేటుపరం చేయడం, ధనవంతులకే ఉన్నతవిద్యావకాశాలు కల్పించడం, విద్యలో మతతత్త్వ వాదాన్ని జొప్పించడం వంటి విద్యా వ్యతిరేక విధానాలను ప్రతిపాదించే జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించే ప్రసక్తే లేదని ఆయన పునరుద్ఘాటించారు. చెంగల్పట్టులో మంగళవారం ఉదయం జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ఆ జిల్లాలో రూ.280.38 కోట్లతో పూర్తయిన పథకాలను ప్రారంభించి, రూ.497.06 కోట్లతో చేపట్టనున్న కొత్త పథకాలకు శంకుస్థాపన చేసి, పలువురు లబ్ధిదారులకు సహాయాలు అందజేశారు. అనంతరం సీఎం ప్రసంగిస్తూ.. లోక్‌సభలో సోమవారం డీఎంకే ఎంపీలు అనుసరించిన తీరు, కేంద్రంపై చేసిన విమర్శలు ప్రశంసనీయమని, ప్రత్యేకించి విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమిళ ఎంపీలను అనాగరికులంటూ చేసిన విమర్శలను ఖండించిన తీరు కూడా సమర్థనీయమన్నారు. రాష్ట్ర విద్యాహక్కులను కాపాడుకునేలా లోక్‌సభలో ఎంపీలు చేసిన వాదనల ఈ సభా ముఖంగా ప్రశంసించడంతో పాటు వారికి ధన్యవాదాలు తెలిపారు. తమిళుల ఆత్మ గౌరవానికి భంగం కలిగితే చూస్తూ ఊరుకోరని దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి చెబుతుండేవారని, ఆ రీతిలోనూ డీఎంకే ఎంపీలు తమిళుల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేలా లోక్‌సభలో పాలకపక్షాన్ని నిలదీశారన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నుండి జాతీయ విద్యావిధానం పేరిట ఏర్పడనున్న ముప్పును ముందస్తుగానే గ్రహించి ఆ విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని, ఈ ఉద్యమానికి తమిళ ప్రజలంతా గట్టి మద్దతు ఇవ్వాలని స్టాలిన్ పిలుపునిచ్చారు.

# ప్రతిపక్షాన్ని తిట్లతో కాదు.. సబ్జెక్టుతో దెబ్బకొట్టాలి

మొదటిపేజీ తరువాయి

శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సభ్యులు అంశాల వారీగా, విభాగాల వారీగా సబ్జెక్టుపై పట్టు సాధించాలని, లేదంటే ఇబ్బందులు పడాల్సి ఉంటుందని అన్నారు. ప్రతిపక్షాలు చేసే ఆరోపణలకు దీటుగా సమాధానాలు చెప్పాలంటే కచ్చితంగా అన్ని సబ్జెక్టులపై పట్టుండాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇప్పుడు ప్రవేశపెట్టేది పూర్తిస్థాయి బడ్జెట్ అని, ఈ దృష్ట్యా ఈ సమావేశాలు అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు.

**– సభ్యులు వందశాతం హాజరుకావాల్సిందే..**

15 నెలల కాలంలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై పూర్తిగా చర్చించేందుకు ఈ సమావేశాల్లో అవకాశం దక్కిందని సీఎం రేవంత్ అన్నారు. సభ్యులంతా సభ జరిగినన్ని రోజులు వందశాతం హాజరు కావాల్సిందేనని చెప్పారు. సభ జరిగేదే ఏడాదిలో 20–25 రోజులని, అందులోనూ 3–4 గంటలపాటే సభ ఉంటుందని పేర్కొన్నారు. ఆ సమయం కూడా కేటాయించలేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా.. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పుడు ఎంపీల హాజరుపై సోనియాగాంధీ ప్రత్యేకంగా దృష్టి సారిస్తారనే విషయాన్ని సీఎం ప్రస్తావించారు. ఇక్కడ కూడా అసెంబ్లీ సమావేశాలు జరిగినన్ని రోజులు విప్‌లు సభ్యుల హాజరును పరిశీలించాలని సూచించారు. సభలో సభ్యులంతా సమన్వయంతో వ్యవహరించాలని, ప్రతిపక్షాల విమర్శలను దీటుగా ఎదుర్కోవాలని అన్నారు. ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తాయని, అధికార పార్టీ సభ్యులుగా సంయమనం పాటించాలని అన్నారు. అయితే అవసరమైనప్పుడు మాత్రం బలమైన కౌంటర్లు ఇవ్వాలన్నారు. సభలో బడ్జెట్‌తోపాటు అప్పులపై శ్వేతపత్రం పెట్టే అంశంపై ఆలోచిస్తున్నామని సీఎం తెలిపారు. గవర్నర్ ప్రసంగం అనంతరం బీఆర్ఎస్ సభ్యులు సభలో గందరగోళం చేస్తున్న సమయంలో విప్‌లు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల్లో చాలా మంది కొత్తగా ఎన్నికైన వారు ఉన్నందున.. శాసనసభలో వ్యవహరించాల్సిన తీరుపై వారు సీనియర్లతో చర్చించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆరు నుంచి పది మంది ఎమ్మెల్యేలు బృందంగా ఏర్పాటు కావాలని, వారికి ఆసక్తి ఉన్న అంశాలపై బృందంలో చర్చించాలని అన్నారు.

## భారత్-మారిషస్
# మధ్య కీలక ఒప్పందాలు



మొదటిపేజీ తరువాయి

12) ఆయన పర్యటనలో రెండు దేశాల మధ్య 8 ప్రధానాంశాలపై ఒప్పందం కుదిరింది. ఆర్థిక నేరాలను అరికట్టడంపై ఇరుదేశాల మధ్య ప్రధానంగా ఒప్పందం కుదిరింది. దీంతో పాటు మరో 8 ఒప్పందాలపై కూడా సంతకాలు జరిగాయి. రక్షణ రంగంలో కూడా ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. విధానం షరతులతో కూడిన సహాయం కంటే పరస్పర గౌరవం, స్థిరత్వం, సామర్థ్య నిర్మాణంపై దృష్టి పెట్టారు. ప్రపంచవ్యాప్తంగా మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, కనెక్టివిటీ ప్రాజెక్టులకు మద్దతు ఇస్తూ, బలమైన భాగస్వామిగా భారతదేశ ఉంటుందని ప్రధానమంత్రి మోదీ అన్నారు. మారిషస్‌కు అన్ని రంగాల్లో భారత్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు మోదీ. రక్షణ రంగమైనా , విద్యా రంగమైనా భారత్ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. రెండు దేశాల మధ్య తరతరాల నుంచి సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు. మారిషస్‌లో సివిల్ సర్వీస్ కళాశాల, ఏరియా హెల్త్ సెంటర్ ప్రాజెక్టులు మారిషస్ పరిపాలనా, ఆరోగ్య సంరక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి, దీర్ఘకాలిక అభివృద్ధి, సామర్థ్య నిర్మాణాన్ని ప్రోత్సహించడానికి భారతదేశం చేస్తున్న ప్రయత్నాలను ప్రతిబింబించాయి. భారతదేశం నుండి గ్రాంట్ రూపంలో సాయం అందించాలని నిర్ణయించారు. ఇది మారిషస్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని భావిస్తున్నారు. మారిషస్ కేవలం ఒక భాగస్వామ్య దేశం మాత్రమే కాదని, మారిషస్ ఒక కుటుంబం అని ప్రధాని మోదీ అన్నారు. భారతదేశ సముద్ర దృక్పథంలో మారిషస్ కేంద్రంగా ఉంది. మారిషస్ అభివృద్ధి చెందినప్పుడు, భారతదేశం ముందుగా జరుపుకుంటుంది. భారతదేశం బలమైన భాగస్వామిగా అనేక దేశాలకు సహాయం చేసిన దేశం మారిషస్ అని ప్రధాని మోదీ అన్నారు.

# కన్నతండ్రే కాటేశాడు

బావురుమంది. దీంతో టీచర్స్ సాయంతో పాప పోలీసులకు వాంగ్మూలం ఇవ్వడంతో పోక్సో కేసు నమోదు అయ్యింది. రాజమండ్రి త్రీ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి(45) మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి 17 ఏళ్ల కిందట మ్యారేజ్ అవ్వగా.. ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య అభిప్రాయ బేధాలు రావడంతో.. ఎనిమిదేళ్ల కిందట బిడ్డల్ని తీసుకుని భార్య అమ్మగారింటికి వెళ్లిపోయింది. తండ్రికి చేదోడుగా ఉండేందుకు.. పదిహేనేళ్ల పెద్ద కుమార్తె మూడేళ్లుగా అతని వద్దే ఉంటోంది. టౌన్‌లోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదవుతుంది. మంగళవారం స్కూల్‌కు వచ్చిన బాలిక ముభావంగా ఉండడాన్ని టీచర్స్ గమనించారు. బాలికను దగ్గరికి తీసుకుని మాట్లాడితే.. తండ్రి చేస్తోన్న ఆకృత్యాన్ని వివరించి వెక్కి వెక్కి ఏడ్చింది. విషయం విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన టీచర్స్.. వారి సహకారంతో పోలీసులకు కంప్లైంట్ చేశారు. కొద్ది నెలల కిందట మద్యం మత్తులో తండ్రి తనపై తొలిసారి లైంగిక దాడి చేశాడని.. నాటి నుంచి నిత్యం అఘాయిత్యానికి పాల్పడుతున్నాడని పోలీసులకు బాలిక చెప్పింది. దీంతో పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# ఏపీ ఈఏపీసెట్ 2025 నోటిఫికేషన్ విడుదల

మొదటిపేజీ తరువాయి

మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రకటనల విడుదల చేసింది. ఈ ఏడాది కూడా ఈఏపీసెట్ పరీక్షను జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడ (జేఎన్‌టీయూకే) నిర్వహించనుంది. ఈఏపీసెట్ 2025లో వచ్చిన ర్యాంకు ఆధారంగా ఏపీలోని యూనివర్సిటీలు, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, అఫిలియేటెడ్ ప్రొఫెషనల్ కాలేజీల్లో అండర్ గ్రాడ్యుయేట్ ప్రొఫెషనల్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు.

# మహిళా జర్నలిస్టుకు 14 రోజుల రిమాండ్

మొదటిపేజీ తరువాయి



సందర్భంగా రేవతి రిమాండ్‌ను రిజక్ట్ చేయాలని ఆమె తరపు న్యాయవాదులు కోర్టును కోరారు. అయితే ఉద్దేశపూర్వకంగా సీఎం రేవంత్ రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించారని, ఆ వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేశారంటూ న్యాయమూర్తి దృష్టికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ తీసుకెళ్లారు. రేవతిపై కఠిన చర్యలు తీసుకోవాలని వాదనలు వినిపించారు. పీపీ వాదనలకు ఏకీభవించిన న్యాయస్థానం రేవతితోపాటు బండి సంధ్య రిమాండ్ విధించింది. ఈ మేరకు వారిద్దరినీ జైలుకు తరలించారు.

# పోసానికి విడుదలపై సస్పెన్స్

మొదటిపేజీ తరువాయి

పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు పీటీ వారెంట్‌పై పోసాని కృష్ణమురళిని తీసుకెళ్లే అవకాశం ఉంది. మరోవైపు పోసాని విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఇవ్వాలని నిన్న(మంగళవారం) కోర్టులో నరసరావుపేట పోలీసులు పిటీషన్ వేశారు. ఇవాళ దీనిపై తీర్పు వెలువడనుంది. ఆదోనిలో నమోదైన కేసులో ఈ నెల 4 నుంచి కర్నూలు జిల్లా జైల్లో పోసాని ఉన్నారు. నిన్ననే బెయిల్‌ను కర్నూలు జెఎఫ్‌సీఎం న్యాయాధికారి అపర్ణ మంజూరు చేశారు ఈ లోపే పోసానికి గుంటూరు సీఐడీ అధికారులు షాక్ ఇచ్చారు.

# రాష్ట్ర వైద్య విద్యను భ్రష్టు పట్టించారు

మొదటిపేజీ తరువాయి

ఉందన్నారు. మోదీ ప్రభుత్వం ఏపీకి 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేసి, గ్రాంట్లు, రుణ రూపంలో రూ. 4900 కోట్లిచ్చిందన్నారు. చేతకాని నాటి సీఎం జగన్ పులివెందులతో సహా, ఒక్క కాలేజీకి కూడా కావలసిన వసతులు పూర్తి చెయ్యలేదన్నారు. ఖర్చు పెట్టాల్సిన మొత్తం రూ. 8,480 కోట్లలో కేవలం 15% మాత్రమే నాలుగేళ్లలో ఖర్చు చేశారని తెలిపారు. మిగిలిన నిధుల్ని జగన్ దారి మళ్లించారని ఆరోపించారు. దాని కారణంగా రాష్ట్రం 2500 మెడికల్ సీట్లు మూల్యంగా చెల్లించాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలనే జగన్ కుట్ర అర్థమవుతోందన్నారు. 5 మెడికల్ కాలేజీలలో అరకొర మౌలిక వసతులతో, కేవలం పేరు కోసం ఆర్భాటంగా తరగతులు ప్రారంభించారని విమర్శించారు. చదువు చెప్పడానికి అధ్యాపకులు లేరు.. సేవలందించడానికి నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది లేరన్నారు. బాలికలు ఉండడానికి వసతి భవనాల్లేవన్నారు. పులివెందుల కళాశాలకు ప్రజాధనం రూ.300 కోట్లు ఖర్చు పెట్టిన జగన్, మదనపల్లిలో రూ.500 కోట్లకు గాను రూ.30 కోట్లు కుడా ఖర్చు పెట్టలేదన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఫిషర్మెన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ను సన్మానించిన కొండాపూర్ గంగపుత్ర సంఘం సభ్యులు.



తొలి అడుగు, చిన్నకోడూరు, మార్చి 12 : సిద్దిపేట జిల్లాలోని కొండాపూర్ గంగపుత్ర సంఘం సభ్యులు తెలంగాణ రాష్ట్ర ఫిషర్మెన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ను హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.వారి గ్రామంలో గంగపుత్రులకు కొందరికి సొసైటీలో సభ్యత్వాలు లేనందున సమస్యలు పరిశీలిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. బుదవారం గంగపుత్ర సంఘం సభ్యులు వారి సమస్యలను సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఫిషర్మెన్ ప్రధాన కార్యదర్శి గుండు వెంకటేష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కి వెళ్లి తెలంగాణ రాష్ట్ర ఫిషర్మెన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ను కలిసి తమ వినతిని సమర్పించారు. మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ ... మీకు ఇంకా ఏ విధమైన సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సందర్భంగా తెలిపారు. మీకు అన్ని విధాలుగా సహకరిస్తానని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజ్జా లక్ష్మణ్, నర్సయ్య, యేసు రత్నం, మల్లయ్య ,కనకయ్య,నవీన్,దాసు,గంగపుత్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరు జిల్లా ప్రత్యేక అధికారి గా అమ్రపాలి నియామకం



తొలి అడుగు, జంగారెడ్డిగూడెం, మార్చి 12 : ఏలూరు జిల్లాకు ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రత్యేక అధికారిగా అమ్రపాలిని నియమించినట్లు చింతలపూడి శాసనసభ్యులు స్వర్ణ రాసిన కుమార్ తెలిపారు ఈ మేరకు ఆయన అమ్రపాలిని మర్యాదపూర్వకంగా కలిసి బొకే ఇచ్చారు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏలూరు జిల్లాకు ఐఏఎస్ గా ఆమ్రపాలిని స్పెషల్ ఆఫీసర్ గా నియమించడం పట్ల వారికి ప్రత్యేక హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# జంగారెడ్డిగూడెం లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం



తొలి అడుగు, జంగారెడ్డిగూడెం మార్చి 12 : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుత రామయ్య ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి వైఎస్ఆర్సిపీ జెండా ఆవిష్కరణ చేశారు. నాయకులు కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జట్టు గురునాథరావు, జడ్పిటిసి పల్నాటి బాబ్జి, వైస్ చైర్మన్ ముప్పడి వీరాంజనేయులు, వీవిఆర్ చౌదరి, అయినాల వెంకట రామమూర్తి ఆకనాటి గోపాలం, కోడూరి రామకృష్ణ పాల్గొన్నారు,

తదనంతరం చైర్మన్ మాట్లాడుతూ ... రాష్ట్ర ప్రజలకు మేలు చేయాలని ముఖ్య ఉద్దేశంతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైయస్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి నేటికి 14 సంవత్సరాలు పూర్తి చేసుకుని 15వ సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంలో గడచిన ఐదు సంవత్సరాల్లో ప్రజలకు సంక్షేమ పథకాలు ఇస్తూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని మంచి చేసిన నాయకుడిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకునే బాధ్యత మనందరిపై ఉందని ఈ కార్యక్రమానికి విచ్చేసిన నాయకులకు కార్యకర్తలకు ప్రజలందరికీ అభినందనలు తెలియజేశారు.

# నిజమేంటో తేల్చి చెప్పిన సౌందర్య భర్త



మొదటిపేజీ తరువాయి

ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. హైదరాబాద్ జల్‌పల్లిలోని మోహన్ బాబు నివాసానికి సంబంధించిన ఆరు ఎకరాల భూమిని సౌందర్య నుంచి ఆయన అక్రమంగా లాక్కున్నారని, అలాగే సౌందర్యను మోహన్ బాబు హత్య చేయించారంటూ ఖమ్మం జిల్లా పోలీసులకు ఫిర్యాదు అందిన విషయం తెలిసిందే. ఈ వార్త ఇప్పుడు పెను సంచలనం సృష్టిస్తోంది. అయితే దీనిపై సౌందర్య భర్త రఘు స్పందించారు. సౌందర్య మరణంలో మోహన్ బాబు పాత్ర ఉందని, అలాగే తమ ఆస్తిని ఆయన అనుభవిస్తున్నారనే ఆరోపణలను రఘు ఖండిరచారు.

హైదరాబాద్‌లోని ఆస్తి విషయమై కొన్ని రోజులుగా తప్పుడు వార్తలు వస్తున్నాయని ఆయన అన్నారు. అవన్నీ నిరాధారమైన ఆరోపణలని కొట్టిపారేశారు. తన భార్య సౌందర్య నుంచి మోహన్ బాబు అక్రమంగా పొందిన ఆస్తి ఏదీ లేదని రఘు తేల్చి చెప్పారు. తనకు తెలిసినంత వరకూ మోహన్ బాబుతో తాము ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరపలేదని స్పష్టం చేశారు. మోహన్ బాబుతో తమకు 25 ఏళ్లుగా బలమైన మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. తన భార్య, బావ, అలాగే ఇరుకుటుంబాలు ఎల్లప్పుడూ సత్సంబంధాలు కలిగి ఉన్నట్లు చెప్పుకొచ్చారు. ఆస్తి వ్యవహారంలో జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని, తమ నుంచి ఆయన ఎలాంటి ఆస్తులూ స్వాధీనం చేసుకోలేదని మరోసారి సుస్పష్టం చేశారు. ఇలాంటి తప్పుడు వార్తలు ప్రచారం చేయ్యొద్దని కోరుకుంటున్నట్లు రఘు విజ్ఞప్తి చేశారు.

కాగా, 17 ఏప్రిల్ 2004న లోక్ సభ ఎన్నికల ప్రచారానికి హెలికాప్టర్‌లో వెళ్తూ ప్రముఖ నటి సౌందర్య చనిపోయిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో సౌందర్య సోదరుడు అమర్నాథ్ సైతం ప్రాణాలు కోల్పోయారు. అయితే తాజాగా ఖమ్మం జిల్లా ఏదులాపురానికి చెందిన ఎదురుగట్ల చిట్టిమల్లు అనే వ్యక్తి ఖమ్మం కలెక్టర్, రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హైదరాబాద్ జల్‌పల్లిలో సౌందర్యకు ఆరు ఎకరాల్లో ఎస్టేట్ ఉందని, దాన్ని అమ్మాలని మోహన్ బాబు ఆమెపై ఒత్తిడి తెచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనికి సౌందర్య ఒప్పుకోకపోవడంతో సాక్ష్యాలు దొరక్కుండా హత్య చేయించారని ఆరోపించాడు. వెంటనే మోహన్ బాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ ఫిర్యాదు చేశాడు. సౌందర్య చనిపోయిన 20 ఏళ్ల తర్వాత ఫిర్యాదు అందడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం అయ్యింది. మెయిన్ స్ట్రీమ్ సహా సోషల్ మీడియాలో పెద్దఎత్తున వైరల్ అయ్యింది. దీంతో సౌందర్య భర్త స్పందించారు.

# స్వయం పరిపాలన దినోత్సవం




తొలిఅడుగు, జనగామ, మార్చి 12 : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం రామచంద్రపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాల లో స్వయం పరిపాలన దినోత్సవ%శీ% సెల్ఫ్ గవర్నమెంట్ టుడే జరుపుకున్నారు.డీఈవోగా సనాది మనుచరణ్,, ఎంఈఓ గా మహమ్మద్ ఆసిన్,, హెచ్ఎంగా మేకల దుర్గా వర్షిని ఉపాధ్యాయులుగా కె,వర్షిని బి, చరణ్ రోషి బి , ప్రవస్తి, కె, వరుణ్ తేజ్ రోషన్, ఎన్ హర్షవర్ధన్ పాఠశాల అటెండర్ ఆంజనేయులు చేశారు

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంఈఓ ఎర్రి వెంకటరెడ్డి కొన్నే కాంప్లెక్స్ హెచ్ఎం గా బాలకృష్ణ రావు సి ఆర్ పి కరుణాకర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం నరేంద్ర చారి ఉపాధ్యాయులు సద్గుణ చారి కే ఐలయ్య గ్రామ పెద్దలు విద్యార్థి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# యువ ఉత్సవ్ 2025 లో భాగంగా జరిగిన జిల్లా స్థాయి సైన్స్ మేళాలి



తొలిఅడుగు, జనగామ, మార్చి 12 : సోలో విభాగంలో లింగాల గణపురం మండలం, కుందారం ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఐలోని రిక్విత్ కుమార్ జిల్లాస్థాయిలో ప్రధమ బహుమతిని సాధించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బిట్ల రవిశంకర్, గైడ్ టీచర్ శ్రీ బి. శ్రీనివాసాచారి ని విద్యార్థి రిక్విత్ ను అభినందించడం జరిగింది.

# ఈపీఎఫ్ చందాదారులకు అలెర్ట్.. ఆ నిబంధనల్లో కీలక మార్పులు

తొలి అడుగు, వివిధ సంస్థల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల కోసం ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ అనే ఉద్యోగ విరమణ పథకం అమలవుతున్న విషయం తెలిసిందే. ఉద్యోగి జీతం నుంచి ప్రతి నెలా కొంత మొత్తాన్ని మినహాయించి దీనిలో జమ చేస్తారు. అంతే మొత్తాన్ని యాజమాన్యం కూడా అందిస్తుంది. తద్వారా ఆ ఉద్యోగి విరమణ సమయానికి పెద్ద మొత్తం పోగవుతుంది. అతడి భవిష్యత్తు జీవితానికి ఆర్థిక భరోసా లభిస్తుంది. అయితే అనుకోని సందర్భంలో ఆ ఉద్యోగి మరణిస్తే అతడికి కుటుంబానికి అండగా ఉండడం కోసం ఎంప్లాయిస్ డిపాజిట్ లింక్డ్ స్కీమ్ (ఈడీఎల్ఐ) కూడా దానిలో కలిసే ఉంటుంది. ఇటీవల జరిగిన సమావేశంలో ఈడీఎల్ఐ పథకంలో నూతన మార్పులు తీసుకువచ్చారు. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ వో) లోని సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీ (సీబీటీ)ల సమావేశం ఈ ఏడాది ఫిబ్రవరి 25న జరిగింది. ఈ సందర్భంగా ఈడీఎల్ఐ పథకంలో కొన్ని మార్పులను ప్రకటించారు. కార్మికుడు లేదా ఉద్యోగి మరణించినప్పుడు అతడి కుటుంబ సభ్యులకు మరింత ప్రయోజనం కలిగించడం ఈ మార్పుల ప్రధాన ఉద్దేశం. తద్వారా వేలాది కుటుంబాలకు మేలు జరుగుతుంది. ఈపీఎఫ్ పథకంలో సభ్యుడిగా చేరి, ఏడాదిలోపు మరణించిన ఉద్యోగి కుటుంబానికి ప్రయోజనం చేకూర్చాలని నిర్ణయించారు. దీని ద్వారా కొత్తగా పథకంలో చేరిన సభ్యుడు ఏడాదిలో మరణిస్తే.. అతడి కుటుంబానికి ఈడీఎల్ఐ ప్రయోజనాన్ని వర్తింపజేస్తారు. తద్వారా ఆ కుటుంబానికి రూ.50 వేల సాయం అందుతుంది. దీనివల్ల ఏటా సుమారు 5 వేల కంటే ఎక్కువ కుటుంబాలకు ఉపయోగం కలుగుతుంది. ఈఎల్ డీఐ పథకం ప్రయోజనాలను పొందటానికి గతంలో నిబంధనలు కొంచెం కఠిన తరంగా ఉండేవి. చందా చెల్లించని కాలం తర్వాత ఈపీఎఫ్ సభ్యుడు మరణిస్తే క్లెయిమ్ ను తిరస్కరించేవారు. వీటిని యాక్టివ్ సర్వీస్ వెలువల జరిగినట్టు నిర్ధారణ చ్టేసేవారు. దీని వల్ల కుటుంబాలు ఈఎల్ డీఐ స్కీమ్ ద్వారా రూ. 2.5 లక్షలు, గరిష్టంగా రూ. 7 లక్షల ప్రయోజనం పొందలేకపోయేవారు. ఇటీవల జరిగిన సమావేశంలో ఈ నిబంధనను సడలించారు.




# స్పేస్ఎక్స్‌తో ఎయిర్‌టెల్ ఒప్పందం




తొలి అడుగు,: భారత్‌లో స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్‌నెట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ఎలన్ మస్క్‌కు చెందిన స్పేస్ఎక్స్‌తో కీలక ఒప్పందం కుదుర్చుకున్నట్లు భారతీ ఎయిర్‌టెల్ ఓ ప్రకటనలో తెలిపింది. దీంతో వినియోగదారులకు స్టార్‌లింక్ హైస్పీడ్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు లభ్యం కానున్నాయని పేర్కొంది. కాగా.. స్టార్‌లింక్ శాటిలైట్ కమ్యూనికేసన్ సేవలకు కేంద్రం అనుమతి తప్పనిసరి అని పేర్కొంది. అప్పుడే ఈ సేవలను భారత్‌లో ఇవ్వడానికి వీలుంటుందని తెలిపింది. భారత్‌లోని యూజర్లకు స్టార్‌లింక్ సేవలను అందించేందుకు స్పేస్ఎక్స్‌తో కలిసి పని చేయడం ఓ కీలకమైన మైలురాయని, తర్వాతి తరం శాటిలైట్ కనెక్టివిటీని యూజర్లకు అందించాలనే తమ నిబద్ధతకు నిదర్శనమని ఎయిర్‌టెల్ మేనేజింగ్ డైరెక్టర్ గోపాల్ విట్టల్ పేర్కొన్నారు. స్పేస్ఎక్స్‌తో ఒప్పందం అమల్లోకి వస్తే భారత్‌లోని మారమూల ప్రాంతాలకు సైతం హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించే సామర్థ్యం ఎయిర్‌టెల్‌కు లభించనుంది.

# యుపిఐ చెల్లింపులపైనా ఫీజు..

తొలి అడుగు, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ), రూపే డెబిట్ కార్డుల ద్వారా నిర్వహించే లావాదేవీలపై మర్చెంట్ ఫీజులను తిరిగి వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు సంబంధించిన బ్యాంకింగ్ అసోసియేషన్ ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యుపిఐ లావాదేవీలపైన ఎటువంటి అదనపు ఛార్జీలు లేవు. కాగా.. వార్షిక ఆదాయం రూ. 40 లక్షల కంటే ఎక్కువ ఉన్న వ్యాపారుల యుపిఐ చెల్లింపుల మీద మర్చెంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్)ను మళ్ళీ తీసుకురావాలని ప్రతిపాదిస్తూ బ్యాంకింగ్ ఇండిస్ట్రీ ప్రతినిధులు కేంద్రానికి పంపించారు. ఇది త్వరలోనే అమల్లోకి రానుందని రిపోర్టులు వస్తోన్నాయి. వీసా కార్డు, మాస్టర్ కార్డు వంటి డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డుల లావాదేవీలపై మర్చెంట్ డిస్కౌంట్ రేట్ చెల్లిస్తున్నారు. అదే తరహాలో యుపిఐ, డెబిట్ కార్డుల చెల్లింపుల పైనా కూడా చార్జీలు వసూలు చేయాలని కేంద్రం భావిస్తోంది. అయితే రూ.40 లక్షల కంటే తక్కువ ఆదాయం కలిగిన వ్యాపారులపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. ఫిన్‌టెక్ సంస్థల ప్రతినిధులు ఇటీవల ఆర్‌బిఐ గవర్నర్ సంజరు మల్హోత్రాతో భేటీలోనూ ఎండిఆర్ అమలు అంశాన్ని ప్రస్తావించారు.

# ముఖేష్ అంబానీతో చేతులు కలిపిన ఎలోన్ మస్క్..




తొలి అడుగు, : ఎలోన్ మస్క్ తన స్టార్‌లింక్ సేవను ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో ద్వారా భారతదేశంలో విస్తరించాలని యోచిస్తున్నాడు. ఎయిర్‌టెల్ తర్వాత, ఇప్పుడు స్టార్‌లింక్ ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ జియోతో చేతులు కలిపింది. స్టార్‌లింక్ భారతదేశంలోకి ప్రవేశించడం వల్ల మీరు ఎలా ప్రయోజనం పొందుతారు? ఎలోన్ మస్క్ భారతదేశంలోకి ప్రవేశించడానికి కొత్త మార్గాలను అన్వేషించడం ప్రారంభించాడు. అతను తన వ్యాపారాన్ని వేగంగా విస్తరిస్తున్నట్లు కనిపిస్తోంది. టెలికాం కంపెనీ ఎయిర్‌టెల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత, ఇప్పుడు ఎలోన్ మస్క్ ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సర్వీస్ స్టార్‌లింక్ ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ జియోతో చేతులు కలిపింది. ఎలోన్ మస్క్ చాలా కాలంగా తన ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సర్వీస్ స్టార్‌లింక్‌ను భారతదేశంలో ప్రారంభించాలని కోరుకుంటున్నాడు. ఇప్పుడు ఎయిర్‌టెల్, జియోతో చేతులు కలిపిన తర్వాత, అతని కల నెరవేరుతున్నట్లు కనిపిస్తోంది. రిలయన్స్ జియో మైక్రోబ్లాగింగ్ ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఒక పోస్ట్‌ను షేర్ చేయడం ద్వారా స్టార్‌లింక్‌తో ఈ ఒప్పందం గురించి సమాచారాన్ని అందించింది. ఎలోన్ మస్క్ స్టార్‌లింక్ కంపెనీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియోతో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే స్టార్‌లింక్ భారతదేశంలో సేవలను ప్రారంభించడానికి ఇంకా కొంత సమయం పట్టవచ్చు. కంపెనీకి ఇంకా కొన్ని అనుమతులు రాకపోవడం దీనికి కారణం. అయితే, ఎయిర్‌టెల్, రిలయన్స్ జియోతో ఈ స్టార్‌లింక్ ఒప్పందం వల్ల మీరు ఎలా ప్రయోజనం పొందుతారు? మీరు కూడా అదే ఆలోచిస్తున్నారు. సరియైనదా? స్టార్‌లింక్‌లో వేలాది తక్కువ భూమి కక్ష్య ఉపగ్రహాలు ఉన్నాయి. ఈ ఉపగ్రహాలు లేజర్ లింక్ ద్వారా ఒకదానికొకటి కనెక్ట్ అవుతాయి ఇది డేటాను వేగంగా ప్రసారం చేస్తుంది. ఈ డేటా వేగంగా ప్రసారం అయితే, ఇకపై హై స్పీడ్ ఇంటర్నెట్ ప్రయోజనాన్ని పొందుతారు. స్టార్‌లింక్ సేవను ఉపయోగించడానికి, ఒక చిన్న పరికరాన్ని ఇన్‌స్టాల్ చేయాలి. దీనిని స్టార్‌లింక్ టెర్మినల్ అని కూడా పిలుస్తారు. ఈ పరికరాన్ని సెటప్ చేసిన తర్వాత, పరికరం ఉపగ్రహం నుండి సంకేతాలను స్వీకరించడం ప్రారంభిస్తుంది. ఇది ప్రజలకు వేగవంతమైన ఇంటర్నెట్‌ను అందిస్తుంది. స్టార్‌లింక్‌ను ఎలోన్ మస్క్ కంపెనీ స్పేస్ఎక్స్ అభివృద్ధి చేసింది. స్టార్‌లింక్ ద్వారా ప్రజలకు హై-స్పీడ్ ఇంటర్నెట్ అందించడానికి, కంపెనీ ఎలాంటి టవర్‌ను ఏర్పాటు చేయవలసిన అవసరం లేదు. స్టార్‌లింక్ ఉద్దేశ్యం హై స్పీడ్ ఇంటర్నెట్ అందించడం.

# సంపాదకీయం

అంధకారంలో బాల్యం..!

భావితరానికి పునాదిరాయిగా ఉండాల్సిన బాల్యం దుర్భరమైన పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోంది. గడపదాటిన బాల్యం వీధుల్లో మురికివాడల్లో దినమొక గండంగా జీవనం సాగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 15 కోట్లు, దేశవ్యాప్తంగా 20 లక్షల మంది పిల్లలు వీధుల్లో జీవనం సాగిస్తున్నట్లు అంచనా. వీరంతా రైల్వే ప్లాట్‌ఫామ్‌లు, బస్‌స్టాండ్‌లు, మురికివాడలు, ఫుట్‌పాత్‌లపై నివసిస్తున్నారు. చెత్త ఏరుకోవడం, చిన్నాచితక ఫుట్‌పాత్ పనులు చేయడం వీరికి అత్యంత సాధారణ జీవనోపాధిగా మారింది. 72 % మంది పిల్లలు ఆరేళ్ల పైబడి ఉండి, బాల కార్మికులుగా కొనసాగుతున్నారు. అశుభ్ర వాతావరణంలో జీవనం సాగిస్తుండటంతో తరచుగా అనారోగ్యానికి గురవుతుండటం, ఆకలిని ఎదుర్కొంటూ పోషకాహార లోపంతోఉంటున్నారు.న్యూఢిల్లీ, కోల్‌కతా, ముంబై వంటి నగరాల్లోని వీధులు మురికివాడలు ఇందుకు అద్దంపడుతున్నాయి. వ్యూహాత్మక కారణాలవల్ల తమ కుటుంబాలను, ఇళ్లను విడిచి వీధుల్లోకి చేరుతున్నారు. కుటుంబ సమస్యలతో 39.1%, పేదరికం కారణంగా 20.9%, నగరాన్ని చూడాలని వచ్చి తప్పిపోయినవారు 3.6% మంది పిల్లలు వీధిబాలలుగా గుర్తించినట్లు పలు సర్వేలు వెల్లడించాయి. మన రాష్ట్రంలో సుమారు 34,037 మంది వీధిబాలలను మహిళా శిశు సంక్షేమశాఖ, పోలీసు, ఇతర శాఖల సమన్వయంతో గుర్తించారు. చదువుకోవాల్సిన వయసులో భిక్షాటన, వీధుల్లో వస్తువులు అమ్ముకోవడం, రోడ్ల పక్కన దుకాణాల్లో పనిచేయడం, కూలిపని, మోటార్ మెకానిక్ షెడ్డుల్లో, హోటల్స్ ఉపాధి మార్గాలుగా ఉన్నాయి.

జీవన సంగ్రామ ప్రాంగణంలో అలుపెరగని సమరం సాగిస్తున్న వీధి బాలల మనసులు తడితే ఎన్నెన్నో కథలు.. మరెన్నెన్నో విషాదగాథలు. తల్లిదండ్రుల ప్రేమానురాగాలకు నోచుకోలేక విధివంచితులుగా మిగిలినవారు, కన్నతల్లి మరణిస్తే రెండో పెళ్ళిచేసుకున్న తండ్రిపై ద్వేషంతో విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టినవారు, తల్లెవరో, తండ్రెవరో తెలియని దయనీయ స్థితిలో గాలికీ, ధూళికీ పెరుగుతున్న అభాగ్యజీవులు.. ఇలా ఎందరో పిల్లలు సరైన దిశాదర్శనం లేక మొగ్గలోనే వాడిపోతున్న జీవితాలకు సంకేతాలుగా మిగిలిపోతున్నారు. మన దేశంలో ప్రతి 18 మంది పిల్లల్లో ఒకరు కార్మికుడని గణాంక వివరాలు చెబుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లోని 28% మంది పిల్లలు విద్యాబుద్ధులకు నోచుకోవడం లేదు.కొవిడ్ కారణంగా 'లాక్ డౌన్'లో ఉన్న సమయంలో వీరి పరిస్థితి మరింత అధ్వానంగా ఉండింది. ఈ దశలో అందరూ కేంద్ర ప్రభుత్వంవైపు ఆశగా చూసినప్పటికీ, 'అసలు వాళ్ళంతా ఏ రాష్ట్రాలవారు, వాళ్ళు ఎక్కడికి వలస వెళ్లి ఏమి చేస్తున్నారు, గణాంకాలు ఏవీ తమ వద్ద లేవు' అని ప్రభుత్వం పార్లమెంట్‌లోనే తన నిస్సహాయతను వ్యక్తం చేసింది. దీంతో ఆ పిల్లల ఉనికి ప్రశ్నార్థకంగా మారడం, చాలా మంది మరణించడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. అదలావుండగా, వీధిబాలలు వీరి నిస్సహాయత చవకైన కూలీలుగా మారి కొంతమందికి లబ్ధి చేకూర్చుతోంది. వీధిబాలల సంరక్షణ, భద్రత, పునరావాసం కోసం జాతీయ బాలల హక్కుల సంరక్షణ కమిషన్ (ఎన్‌సిపిసిఆర్) రూపొందించిన ప్రామాణిక విధివిధానాలను అమలు చేయాలని, బాలస్వరాజ్ పోర్టల్‌లలో నమోదైన పిల్లలను రక్షించడానికి, పునరావాసం కల్పించడానికి చర్యలు తీసుకోవాలంటూ సుప్రీం కోర్టు కూడా ఆదేశించింది.

వీధి బాలలను ఆశ్రయ కేంద్రాలకు తరలించడంకన్నా వారి కుటుంబాలతో కలిపేందుకు ప్రయత్నించాలని, వారికి అవసరమైన సంరక్షణ, భద్రతను అందజేయాలంటూ నిబంధనలు సూచిస్తున్నప్పటికీ ఆయా రాష్ట్రాలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు తదితర వర్గాల మధ్య సమన్వయం లేకపోవడంతో వీధి బాలల జీవితం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లుగా మారింది. ఏ రోజుకు ఆ రోజు పనిచేస్తేనే గానీ కడుపు నిండని వీధి బాలలు చెత్త ఏరుకోవడం, భిక్షాటన, కూడళ్ల వద్ద వస్తువులు అమ్మడం వంటి ఉపాధి మార్గాలను ఎంచుకుంటున్నారు. మరి కొంతమంది దళారుల ఉచ్చులో చిక్కుకుని మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలను దొంగచాటుగా విక్రయిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. విధి నిర్వహణలో భాగంగా శక్తినిమించిన పనులు చేయడంతో గాయాల పాలవడం, అనారోగ్యం వంటి సమస్యలు తరచుగా తలెత్తుతున్నాయి. దీనికితోడు అపరిశుభ్రతమైన వాతావరణంలో జీవనం సాగిస్తుండడంతో దీర్ఘకాలిక వ్యాధుల బారినపడుతున్నారు. చాలా మంది పిల్లలకు జనన, కుల, కుటుంబ ఆదాయ ధ్రువీకరణ గుర్తింపు వంటి పత్రాలు లేకపోవడంతో విద్య, సాంఘిక సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. ఈమేరకు ప్రభుత్వం పలు విధానాలు రూపొందించినప్పటికీ వీటిపై ఈ పిల్లలకు అవగాహన లేకపోవడంతో వాటిని అందుకోలేకపోతున్నారు.


ఇంటికి, తల్లిదండ్రులకు దూరమైన పిల్లల జీవితం దాదాపుగా వీధుల్లోనే ముగుస్తుండటం బాధాకరమైన విషయం. మురికివాడల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో 'భిన్నత్వంలో ఏకత్వం' అనే నినాదంతో ముందుకు వచ్చిన ప్రభుత్వాలు, సురక్షితమైన సమ్మిళిత సమాజాన్ని నిర్మించడంలో విఫలమయ్యాయి.దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వలసల సంఖ్య రెట్టింపైంది. చట్టవిరుద్ధంగా ఆక్రమించబడిన ప్రభుత్వ భూములు, ఫుట్‌పాత్‌లపై గుడిసెలు వేసుకుని జీవిస్తున్న కుటుంబాల సంఖ్య పెరిగింది. దీంతో మురికివాడలు పెరిగిపోయాయి. దోపిడీ, భిక్షాటన, మాదకద్రవ్యాల విక్రయం వంటి కార్యకలాపాలు కుటుంబాలకు ఆర్థికసాయంగా నిలుస్తోంది. ఈ ప్రమాదకర ఉపాధిమార్గాలు పిల్లల్లో నేరపూరిత మనస్తత్వాన్ని పెంచుతున్నాయి. క్రమంగా లైంగిక హింసకు బాధితులుగా మారుతున్నారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి 'బేటీ బచావో బేటీ పడావో' వంటి విధానాలను జువెనైల్ చట్టం వంటి చట్టపరమైన రక్షణలతో అనుసంధానించడం అవసరం. మురికివాడ ప్రాంతాలకు అనుగుణంగా ఈ విధానాల పరిధిని విస్తరించాలి. మురికివాడల పిల్లలజీవితాలను మార్చడం ద్వారా నిజమైన, దీర్ఘకాలిక మార్పును ఆశించవచ్చు. మురికివాడల పిల్లలను పోషకాహార లోపం, దోపిడీల బారినుంచి రక్షింపబడాలి. స్థిరమైన సామాజిక మార్పుకోసం అట్టడుగువర్గాల మద్దతు ఎంతో అవసరం. పిల్లల రక్షణకోసం వ్యక్తులు, సంస్థలు ముందుకు రావాలి.

# ఐపీఓ బాటలో ఏథర్ ఎనర్జీ.. వచ్చే నెలలోనే ప్రారంభం..?





తొలి అడుగు, : ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ తన అత్యుత్తమ కంపల్సరీ కన్వర్టిబుల్ ప్రిఫరెన్స్ షేర్లను (సీసీపీఎస్) ఈక్విటీగా మార్చింది. ఈ చర్యలతో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఓ వైపు గణనీయమైన అడుగు వేసినట్లు అయ్యిందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ పబ్లిక్ ఇష్యూ ఏప్రిల్‌లో ప్రారంభించే మర్చంట్ బ్యాంకింగ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటీవల యాక్సెస్ చేసిన కంపెనీల రిజిస్ట్రార్ (ఆర్ఓసీ) ఫైలింగ్ ప్రకారం కంపెనీ డైరెక్టర్ల బోర్డు మార్చి 8, 2025న ఒక తీర్మానాన్ని ఆమోదించింది. రూ.1.73 కోట్లకు పైగా బకాయి ఉన్న సీసీపీఎస్‌లను రూ.24.04 కోట్ల పూర్తిగా చెల్లించిన ఈక్విటీ షేర్లుగా మార్చడానికి ఆమోదం తెలిపింది. ఒక్కొక్కటి కేవలం రూ.1 ఫేస్ వ్యాల్యూ కలిగిన ఈ షేర్లు, ప్రస్తుత ఈక్విటీ షేర్లతో సమానంగా ఉంటాయి. సీసీపీఎస్ అనేవి ఒక రకమైన ప్రిఫరెన్స్ షేర్లు, వీటిని ఒక నిర్దిష్ట వ్యవధి తర్వాత లేదా కొన్ని సంఘటనలు జరిగిన తర్వాత ఈక్విటీ షేర్లుగా మార్చాలి. మార్చిన సీసీపీఎస్‌లలో కాలక్రమేణా జారీ చేసిన బహుళ సిరీస్‌లు ఉన్నాయి. అవి సిరీస్ సీడ్ (ఒకటి నుంచి నాలుగు), సిరీస్ ఏ నుంచి జీ, బోనస్ సీసీపీఎస్ వంటి అదనపు సిరీస్‌లు, వివిధ ఈ క్లాసెస్ (ఈ, ఈ1, ఈ2)గా ఉంటాయని నిపుణ్నుల వెల్లడిస్తున్నారు. సెబీ ఇష్యూ ఆఫ్ క్యాపిటల్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్మెంట్స్ (ఐసీడీఆర్) నిబంధనల ప్రకారం మార్కెట్ రెగ్యులేటర్‌కు రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (ఆర్‌హెచ్‌పీ) దాఖలు చేయడానికి ముందు అన్ని సీసీపీఎస్‌లను ఈక్విటీగా మార్చాలి. ఏథర్ ఎనర్జీ తన బకాయి ఉన్న సీసీపీఎస్‌లను ఈక్విటీగా మార్చాలనే నిర్ణయం, కంపెనీ తన పబ్లిక్ ఇష్యూ వైపు వేగంగా పురోగమిస్తోందని సూచిస్తుంది. 2026 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించే మొదటి వాటిలో ఒకటి కావచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో మహారాష్ట్రలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన కర్మాగారాన్ని ఏర్పాటు చేయడానికి, రుణ తగ్గింపునకు నిధులను సేకరించడానికి ఏథర్ ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది. డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్పీ) ప్రకారం ఐపీఓలో రూ. 3,100 కోట్ల విలువైన ఈక్విటీ షేర్ల తాజా ఇష్యూ, ప్రమోటర్లు, పెట్టుబడిదారుల ద్వారా 2.2 కోట్ల ఈక్విటీ షేర్ల ఆఫర్-ఫర్-సేల్ కలయిక ఉంటుంది. ఏథర్ ఎనర్జీ ఐపీఓను ప్రారంభిస్తే గత ఏడాది ఆగస్టులో భవిష్ అగర్వాల్‌కు చెందిన ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ రూ.6,145 కోట్ల ఐపీఓను విడుదల చేసిన తర్వాత పబ్లిక్‌గా విక్రయించబడుతున్న రెండవ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ అవుతుంది. 20 సంవత్సరాలకు పైగా దేశంలో ఒక ఆటోమేకర్ చేసిన మొదటి ఇష్యూ కూడా ఇదే అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఓలా ఎలక్ట్రిక్‌కు సంబంధించిన ఐపీఓలో రూ. 5,500 కోట్ల తాజా ఇష్యూ, 8.4 కోట్ల షేర్ల ఆఫర్ ఫర్ సేల్ ఉన్నాయి.

# ఎఫ్‌డీలపై అధిక వడ్డీరేటు కావాలా..?





తొలి అడుగు, : వివిధ బ్యాంకులలో అమలువుతున్న ఫిక్స్ డ్ డిపాజిట్ పథకాలపై ప్రజలు ఎంతో ఆసక్తి చూపుతారు. ఎలాంటి రిస్క్ లేకుండా నిర్ణీత కాలానికి వడ్డీని అందించే ఆ పథకాలలో డబ్బులను ఇన్వెస్ట్ చేయడానికి ఇష్టపడతారు. సీనియర్ సిటిజన్లతో పాటు సాధారణ ఖాతాదారులు సైతం వీటిలో పెట్టుబడి పెడతారు. అయితే ఎఫ్ డీలపై అందించే వడ్డీరేటును గమనించుకోవడం చాలా అవసరం. ఇటీవల రిజర్వ్ బ్యాంకు రెపోరేటును తగ్గించింది. దానికి అనుగుణంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు తమ రుణాలపై వడ్డీలను కుదించాయి. దానితో పాటు ఎఫ్ డీలపై వడ్డీరేట్లు కూడా తగ్గిపోయాయి. కానీ కొన్ని స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు (ఎఫ్ఎఫ్ బీ) మాత్రం ఏడాదికి 9 శాతం వరకూ వడ్డీరేటును అమలు చేస్తున్నాయి. వాటి వివరాలు, వడ్డీరేట్లను తెలుసుకుందాం. పేద, తక్కువ వర్గాల ప్రజలకు ప్రాథమిక బ్యాంకింగ్ సేవలు అందించడం స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు(ఎస్ఎఫ్ బీ) ప్రధాన కర్తవ్యం. అందుకోసం రిజర్వ్ బ్యాంకు వీటిని ఏర్పాటు చేసింది. చిన్న పరిశ్రమలు, చిన్న సన్నకారు రైతులు, చిన్న వ్యాపార యూనిట్లు, అసంఘటిత రంగంలో పనిచ్టేసే వారు వీటి ద్వారా సేవలు పొందుతారు. ఎస్ఎఫ్ బీలు కూడా ఫిక్స్ డ్ డిపాజిట్ పథకాలను అమలు చేస్తున్నాయి. ఏడాది కాలపరిమితికి ఎఫ్ డీలపై అత్యధిక వడ్డీరేటు అందిస్తున్నాయి. యూనిటీ స్మాల్ ఫైనాన్స్, నార్త్ ఈస్ట్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులలో ఎఫ్ డీలపై అత్యధిక వడ్డీరేటు అమలవుతోంది. యూనిటీ బ్యాంకులో 1001 రోజులకు ఏడాదికి 9 శాతం వడ్డీరేటు ఉంది. మామూలుగా ఏడాదికి 7.85 శాతం అందజేస్తోంది. నార్త్ ఈస్ట్ బ్యాంకులో 18 నెలల ఒక్క రోజు నుంచి 36 నెలల కాలపరిమితికి 9 శాతం వడ్డీ లభిస్తుంది. ఏడాది స్థిర డిపాజిట్లపై 7 శాతం ఇస్తున్నారు. సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో ఐదేళ్ల కాలపరిమితికి ఏడాది 8.6 శాతం, ఏడాదికి అయితే 8.25 శాతం వడ్డీ అందిస్తున్నారు. ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో 2 నుంచి 3 సంవత్సరాలు లేదా 1500 రోజుల డిపాజిట్లకు ఏడాదికి 8.5 శాతం వడ్డీ ఉంటుంది. ఇక ఏడాదికి 8 శాతం అమలు చేస్తున్నారు. ఈఎస్ఏఎఫ్ బ్యాంకులో 888 రోజులకు అత్యధికంగా 8.38 శాతం వడ్డీని అందిస్తారు. కానీ ఏడాదికి అయితే 6 శాతం ఉంటుంది.





# హృదయ రేఖ ఇలా ఉంటే జరగబోయేది ఇదే..!

తొలి అడుగు, : మీ చేతులలోని హృదయ రేఖ మీ వ్యక్తిత్వాన్ని, భావోద్వేగ స్థిరత్వాన్ని సూచిస్తుంది. ఇది మీరు ప్రేమను ఎలా స్వీకరిస్తారో ఇతరులతో సంబంధాలు ఎలా నిర్వహిస్తారో తెలియజేస్తుంది. హృదయ రేఖ పొడవు, ఆకారం, స్థానాన్ని బట్టి మీరు ఆచరణాత్మకంగా ఉంటారా భావోద్వేగపరంగా బలంగా ఉంటారా అనేది తెలుస్తుంది. ఈ రేఖను విశ్లేషించడం ద్వారా వ్యక్తిగత లక్ష్యాలను అర్థం చేసుకోవచ్చు. మీ రెండు చేతులలోని హృదయ రేఖలు సమంగా ఉంటే మీరు సమతుల్యమైన, ప్రశాంతమైన వ్యక్తిగా ఉంటారు. మీరు భావోద్వేగపరంగా స్థిరంగా ఉండటమే కాక కఠిన పరిస్థితుల్లో కూడా శాంతిని రక్షించడంలో నిపుణులు. మీ చుట్టూ ఉన్నవారు తరచుగా సలహా మద్దతు కోసం మిమ్మల్ని ఆశ్రయిస్తారు. మీకు మంచి సహనశక్తి ఉండటంతో ఇతరులను ప్రోత్సహించడంలో దిట్ట. సంఘర్షణ సన్నివేశాల్లో కూడా మీరు శాంతిని నెలకొల్పడానికి ప్రయత్నిస్తారు. ఈ స్వభావం మీకు బలమైన సంబంధాలు ఏర్పరచుకునేందుకు తోడ్పడుతుంది. కెరీర్ పరంగా, కౌన్సెలింగ్, బోధన వంటి రంగాలలో మీరు విజయవంతమవుతారు. మీ ఎడమ చేతి హృదయ రేఖ కుడి చేతి కంటే ఎత్తుగా ఉంటే మీరు ధైర్యవంతులు, స్వేచ్ఛకు విలువనిచ్చేవారు. మీ వ్యక్తిత్వం ఉత్సాహం, సృజనాత్మకతతో నిండి ఉంటుంది. మీరు ఇతరులతో లోతైన సంబంధాలు ఏర్పరచుకునే వారికి, పెద్ద సామాజిక వర్గాలు నచ్చకపోవచ్చు. మీరు సృజనాత్మక రంగాలలో సక్సెస్ అవుతారు. కళలు, మార్కెటింగ్, వినోదం వంటి రంగాలలో మీ ప్రతిభ వెలుగొందుతుంది. మీరు ఒంటరితనం గౌరవించి, మీ సొంత మార్గంలో సాగుతారు. ఈ హృదయ రేఖ కలిగినవారు రచయితలుగా, సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇచ్చే వ్యక్తులుగా మారతారు. మీ కుడి చేతి హృదయ రేఖ ఎత్తుగా ఉంటే మీరు ఆచరణాత్మకమైన, బలమైన వ్యక్తి. మీరు జీవితంలో గణనీయమైన విజయం సాధించడానికి కృషి చేస్తారు. మీకు ఇతరుల పట్ల గౌరవం ఉంటే అదే సమయంలో వ్యక్తిగత జీవితంలో రక్షణాత్మకంగా ఉంటారు. మీరు నిరంతరం మీకు అవసరమైన భద్రతను అందించడానికి ప్రయత్నిస్తారు. మీరు లాజిక్ ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటారు.



భావోద్వేగాలను పక్కనపెట్టి ప్రతిదాన్ని ఆచరణాత్మకంగా చూడగలరు. మీరు వ్యాపార, అభివృద్ధి, డిజైన్ రంగాలలో విజయవంతం అవుతారు.

# స్వీట్లు తిన్న తర్వాత నీళ్లు తాగుతున్నారా?



తొలి అడుగు, : మనలో చాలా మందికి స్వీట్లంటే బలే ఇష్టం. రసగుల్లా, గులాబ్ జామూన్, జిలేబీ, సందేశ్, మైసూర్ పాక్.. వంటి రకరకాల స్వీట్లు అందరూ ఎంతో ఇష్టం తింటారు. అయితే మనలో చాలా మంది స్వీట్లు తిన్న వెంటనే దాహంగా అనిపించడంతో నీళ్ల తాగుతుంటారు. ఇలా చేయడం దాదాపు మనందరికీ ఉన్న అలవాటు. రసగుల్లా, గులాబ్ జామూన్, జిలేబీ, సందేశ్, మైసూర్ పాక్.. వంటి రకరకాల స్వీట్లు అందరూ ఎంతో ఇష్టం తింటారు. అయితే మనలో చాలా మంది స్వీట్లు తిన్న వెంటనే దాహంగా అనిపించడంతో నీళ్లు తాగుతుంటారు. ఇలా చేయడం దాదాపు మనందరికీ ఉన్న అలవాటు. కానీ మీకు తెలుసా? స్వీట్లు తిన్న తర్వాత ఇలా నీరు తాగితే శరీరానికి ఏమవుతుందో? నిపుణుల అభిప్రాయం ప్రకారం.. స్వీట్లు తిన్న తర్వాత ఖచ్చితంగా నీళ్లు తాగాలని చెబుతున్నారు. ఫలితంగా, శరీరానికి కలిగే ప్రయోజనాలు అన్నీఇన్నీ కావుమరీ. స్వీట్లు త్వరగా తినడం వల్ల శరీరంలో చక్కెర పరిమాణం పెరుగుతుందని నిపుణులు అంటున్నారు. ఇది ఒంట్లో చక్కెర పెరుగుదలకు కారణం అవుతుంది. ఈ సమస్య డయాబెటీస్ వంటి చక్కెర సమస్యలతో బాధపడేవారు మాత్రమే కాదు అందరికీ జరుగుతుంది. కాబట్టి స్వీట్లు తిన్న తర్వాత నీరు త్రాగడం వల్ల ఈ చక్కెర స్పైక్ సమస్యను నివారిస్తుంది. నీరు ఏదైనా ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. అందువల్ల తీపి ఆహారాలు సరిగ్గా జీర్ణం కావడానికి నీరు త్రాగటం చాలా ముఖ్యం. స్వీట్లు తినడం వల్ల దంత బ్యాక్టీరియా మరింత చురుగ్గా మారుతుంది. కాబట్టి నీరు త్రాగడం వల్ల దంతాల్లోని ఆహార పదార్థాలు క్లీన్ అయ్యి శుభ్రంగా ఉంటుంది. దీంతో దంత ఆరోగ్యం కూడా బాగుంటుంది. చిగుళ్ల నొప్పితో బాధపడేవారు స్వీట్లు తిన్న తర్వాత ఖచ్చితంగా నీళ్లు తాగాలి. లేకపోతే నొప్పి పెరుగుతుంది.

# కరివేపాకుని ఇలా తింటే కలిగే బెనిఫిట్స్...

తొలి అడుగు, ఆహార రుచిని పెంచడానికి అనేక పదార్థాలను ఉపయోగిస్తారు. భారతీయ వంటగదిలో ఉపయోగించే సుగంధ ద్రవ్యాలు ఆహార రుచిని పెంచడమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. సాధారణంగా దాదాపు అందరూ ఉపయోగించే పదార్థాలలో కరివేపాకు ఒకటి. ఇది ఆహార రుచిని పెంచడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుందని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కరివేపాకు తినడం వల్ల ఆరోగ్యం, అందానికి కలిగే ప్రయోజనాలు పుష్కలంగా ఉన్నాయి. కరివేపాకు తినడం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ పెరిగి ఐరన్ లోపం తగ్గుతుంది. ఇందులో ఎన్నో అద్భుత ఔషధ గుణాలు ఉన్నాయి. దీనిని ఆహారంలో తీసుకుంటే చాలా లాభాలున్నాయి. బరువు తగ్గడానికి, జీర్ణక్రియ బాగా ఉండటం చాలా ముఖ్యం. అటువంటి పరిస్థితిలో, కరివేపాకు మీ జీర్ణక్రియను మెరుగుపరచడం ద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. దీంతో గుండె సంబంధ సమస్యలు తగ్గి హార్ట్ హెల్త్ బాగుంటుంది. కరివేపాకు నమలడం వల్ల ఇది ఆమ్లతను తగ్గించడం, జీర్ణ ఎంజైమ్‌లను పెంచడం ద్వారా జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇది ఉబ్బరం, గ్యాస్, మలబద్ధకం చికిత్సకు కూడా సహాయపడుతుంది. అంతేకాదు.. కరివేపాకులో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది దంతాలు, ఎముకల ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. కరివేపాకు తినడం వల్ల కీళ్ళనొప్పులు, షుగర్ ఉన్నవారిలో ఎముకలని



నొప్పిని తగ్గించి ఎముకల్ని బలంగా మారుస్తుంది. కరివేపాకులో ఫాస్పరస్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి, దీనిని తీసుకోవడం వల్ల డీటాక్సీఫైయర్‌లా పనిచేస్తుంది. కరివేపాకులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియని మెరుగ్గా చేస్తుంది. దీంతో మలబద్ధకం సమస్య దూరమవుతుంది. జుట్టు రాలడానికి కారణం కుదుళ్ళు ఆరోగ్యంగా లేకపోవడమే.. ఇందుకు ప్రోటీన్ లోపం, ఐరన్ లోపం. ఈ రెండు లోపాల కారణంగా జుట్టు రాలుతుంది. అయితే, కరివేపాకు తింటే ఈ సమస్యలు దూరమవుతాయి. కరివేపాకులో విటమిన్ బి12, విటమిన్ ఇ జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి.

# సరిగ్గా నిద్రపోకపోతే మీ ఆరోగ్యం షెడ్డుకే.!

తొలి అడుగు, ఇది కొంచెం ఆలోచించాల్సిన అంశమే.. ఇండియాకు నిద్ర పట్టట్లేదు. దేశంలో కంటి నిండా నిద్రపోయిన వారు కరువు అయ్యారు. అవునండీ.! ఇది నిజమే.. రోజుకు 8 నుంచి 10 గంటలు నిద్ర పోవాలి. అయితే దేశంలో 2 శాతంమందికే కంటి నిండా నిద్ర పడుతోంది. ఇండియాకు నిద్ర పట్టట్లేదు. కంటి నిండా కునుకు లేదు. దేశం నిదరోవట్లేదు. దేశమంటే మనుషులే కదా! ఇప్పుడు దేశంలో చాలామంది



నిద్ర లేమితో బాధ పడుతున్నారు. కంటి నిండా కునుకు తీసి ఎన్నాళ్లయిందో అంటూ బాధ పడుతున్నారు. దేశంలో స్లీప్ డిజార్డర్‌తో ఎంతమంది బాధ పడుతున్నారో చూద్దాం. ఇదేదో ఆషామాషీగా చెప్పింది కాదు. దేశంలోని 348 జిల్లాల్లో 43వేల మందితో సర్వే చేసి చెప్పారు నిపుణులు. అయితే ఏ కారణం వల్ల ఎక్కువగా స్లీప్ డిస్టబ్ అవుతుందో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. అదేపనిగా బాత్రూమ్‌కి వెళ్లడమే నిద్రకు పెద్ద డిస్టబెన్స్‌గా 72 శాతం మంది చెబుతున్నారు. ఇక స్లీప్ షెడ్యూల్‌లో తేడా వల్ల నిద్రాభంగం అంటున్నారు 25 శాతంమంది. ఇక దోమలు, బయటి శబ్దాలు కారణం అని కొందరు, మెడికల్ కండిషన్స్ అని కొందరు చెబుతున్నారు. ఇంకొంతమంది పిల్లలు, ఇంట్లో సమస్యలు అని వాపోతున్నారు. మరికొందరు మొబైల్ ఫోన్లకు అతుక్కుపోయి అర్ధరాత్రి, అపరాత్రి చాటింగులతో నిద్ర పోవడమే మానేశారు. సరైన నిద్రలేకపోవడంతో ఇండియాలో 47 శాతంమంది ఉద్యోగులు వారంలో ఒక్క రోజైనా లీవ్ పెడుతున్నారంటే, నిద్ర లేమి ఎంత పెద్ద సమస్యగా మారిందో అర్థం చేసుకోవచ్చు. ఇక నైట్ షిఫ్ట్ కారణంగా 37 శాతం స్లీప్ డిసార్డర్‌తో బాధ పడుతున్నారు. కంటి నిండా కునుకు లేకపోవడంతో చాలామందికి గుండె జబ్బులు, ఊబకాయం, టైప్ -2 డయాబెటిస్ వంటి సమస్యలు వస్తున్నాయి.


తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక



# పెళ్లి పై మీనాక్షి చౌదరి క్లారిటీ మాములుగా లేదుగా..

తొలి అడుగు, : మీనాక్షి చౌదరి. సుశాంత్ 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' మూవీతో టాలీవుడ్‌ను పలకరించిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత మాస్ మహారాజా రవితేజ హీరోగా చేసిన 'ఖిలాడీ'లో నటించి మెప్పించింది. మాస్ పాటకు స్టెప్పులేసి అదరహో అనిపించింది. హాట్ హాట్ అందాలతో కుర్రాళ్లను గిలిగింతలు పెట్టింది. ఆ తర్వాత అడివి శేష్ సరసన 'హిట్-2'లో చేసింది. కెరీర్ బిగినింగ్ లో కాస్త స్లోగా సినిమాలు చేసిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు వరుస సినిమాలతో దూసుకుపోతుంది. కెరీర్ స్టార్టింగ్ లోనే సూపర్ స్టార్ మహేష్ బాబు సినిమాలో నటించే అవకాశం అందుకుంది. మహేష్ బాబు నటించిన గుంటూరు కారంలో నటించి మెప్పించింది... ఇవి కాక విశ్వక్ సేన్, వరుణ్ తేజ్, దుల్కర్ సల్మాన్ హీరోలుగా నటిస్తున్న సినిమాల్లో నటించి మెప్పించింది. రీసెంట్ సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ హిట్ అందుకుంది. అలాగే కొన్ని తెలుగు సినిమాలను ఓకే చేసింది. ఇవికాక పలు తమిళ సినిమాలు కూడా షూటింగ్ దశలో ఉన్నాయి. మొత్తానికి ఈ బ్యూటీ కొన్నాళ్లు తెలుగు ఇండస్ట్రీలో తన ముద్ర వేస్తుందన్న విషయం మాత్రం వాస్తవం. ఇక సంక్రాంతికి వస్తున్నాం సినిమా తర్వాత మీనాక్షి క్రేజ్ తో పాటు ఆఫర్స్ కూడా పెరిగిపోయాయి. తెలుగు తమిళ్ లో అవకాశాలు అందుకుంటుంది ఈ వయ్యారి భామ.

# రాబిన్ హుడ్ మీద నమ్మకం వచ్చేసింది



తొలి అడుగు, : గత డిసెంబర్లోనే రావాల్సిన రాబిన్ హుడ్ తిరిగి సంక్రాంతి అనుకుని పోటీ వల్ల మళ్ళీ వద్దనుకుని చివరాఖరికి మార్చి 28 విడుదలవుతున్న సంగతి తెలిసిందే. వరస ఫ్లాపుల తర్వాత ఖచ్చితంగా బ్లాక్ బస్టర్ కొట్టాల్సిన బాధ్యత మోస్తున్న నితిన్ కు ఈ సినిమా మీద భారీ ఆశలున్నాయి. అందులోనూ కెరీర్ పెద్ద హిట్ భీష్మ ఇచ్చిన వెంకీ కుడుముల దర్శకుడు కావడంతో ఆ నమ్మకం రెట్టింపయ్యింది. నిన్న జరిగిన ప్రెస్ మీట్ లో హీరో, డైరెక్టర్ ఇద్దరి మాటల్లో అదే వ్యక్తమయ్యింది. ఫైనల్ కాపీ చూశాక ఇద్దరు మాట్లాడుకుని, ప్రేమించుకుని, కామించబోతు ఆగిపోయామని నితిన్ చెప్పడం ఘొల్లున నవ్వించింది.అంతగా సినిమా నచ్చిందని చెప్పడం నితిన్ ఉద్దేశం. శ్రీలీల, వెంకీ కుడుముల, నిర్మాత రవిశంకర్ తదితరులు మాటల్లోనూ ఇదే స్పష్టమయ్యింది. నాటకిరీటీ రాజేంద్ర ప్రసాద్ కొన్నేళ్ల పాటు తనను గుర్తు పెట్టుకుంటారని, పోస్టర్లలో తాను కనిపించకపోయినా గొప్ప పాత్ర ఇచ్చారంటూ తనదైన శైలిలో నవ్వులు పూయిస్తూ చెప్పారు. వెంకీ కుడుములకు ఈ సక్సెస్ చాలా కీలకం. ఛలో తర్వాత భీష్మ సూపర్ హిట్ అయ్యింది. చిరంజీవి ప్రాజెక్టు అనౌన్స్ మెంట్ దాకా వచ్చి ఆగిపోయింది. తర్వాత కొంత గ్యాప్ తీసుకుని రాబిన్ హుడ్ సిద్ధం చేసుకున్నాడు. ఇది బ్లాక్ బస్టర్ అయితే టాప్ లీగ్ లోకి వచ్చేయొచ్చు. నితిన్ విషయానికి వస్తే తక్కువ నిడివిలో బ్యాక్ టు బ్యాక్ పలకరించబోతున్నాడు. ఇప్పుడు రాబిన్ హుడ్ కనక వర్కౌట్ అయితే ఆపై మే లేదా జూన్ లో రిలీజయ్యే వేణు శ్రీరామ్ తమ్ముడు బిజినెస్ కి హైప్ వస్తుంది. రాబిన్ హుడ్ లో లక్కీ గర్ల్ శ్రీలీల ఎలాగూ ఉంది కాబట్టి ఫ్యాన్స్ నిశ్చింతగా ఉన్నారు. అలాని పోటీ లేదని కాదు. మ్యాడ్ స్క్వేర్ కి యూత్ లో మంచి క్రేజ్ ఉంది.

## సాయికుమార్‌కి కొమురం భీమ్ జాతీయ పురస్కారం



తొలి అడుగు, నటుడు సాయి కుమార్‌కి అరుదైన గౌరవం లభించింది. 2024 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మక జాతీయ పురస్కారానికి సాయికుమార్‌ని ఎంపిక చేసినట్లు సెలక్షన్ చైర్మన్ సి.పార్ధ సారధి, కో-చైర్మన్ నాగబాల డి.సురేష్ కుమార్, కన్వీనర్ కొమురం సోనే రావు, శిడాం అర్జు మాస్టారు ఓ అధికారిక ప్రకటనలో తెలిపారు. గత 12 సంవత్సరాలుగా 'భారత కల్చరల్ అకాడమి, ఓం సాయి తేజ ఆర్ట్స్, ఆదివాసి సాంస్కృతిక పరిషత్' సంయుక్త నిర్వహణలో ఈ అవార్డ్‌ను అందిస్తున్నారు. గతంలో ఈ కొమురం భీమ్ అవార్డును సుద్దాల అశోక్ తేజ, అల్లాణి శ్రీధర్, రాజేంద్ర ప్రసాద్, గూడ అంజయ్య వంటి దిగ్గజాలకు ఈ పురస్కారంతో సన్మానించారు. ఈ అవార్డుతో పాటు జ్ఞాపికను, యాభై ఒక వెయ్యి రూపాయల నగదు అందిస్తామని కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈనెల 23వ తేదీ ఈ పురస్కరోత్సవం కొమురం భీమ్ జిల్లా, ఆసిఫాబాద్ కేంద్రంలోని ప్రమీల గార్డెన్స్‌లో జరుగనుంది. శాసనసభ్యులు కోవా లక్ష్మి, బిజేపి నాయకులు అరిగెల నాగేశ్వర రావు పర్యవేక్షణలో ఈ వేడుక జరుగనుందని నిర్వాహకులు తెలిపారు.

## విశ్వంభర అంత రిస్కు చేయగలదా



తొలి అడుగు, మెగాస్టార్ చిరంజీవి మెగా ఫాంటసీ మూవీ విశ్వంభర విడుదల చిరు పుట్టినరోజు ఆగస్ట్ 22కి ఉండొచ్చన్న వార్త మెల్లగా పాకుతోంది. యూనిట్ నుంచి ఎలాంటి అధికార ప్రకటన రానప్పటికీ వేసవిలో హరిహర వీరమల్లు ఉంది కాబట్టి మరో మెగా ప్యాన్ ఇండియా మూవీ ఎందుకనే ఉద్దేశంతో పాటు హీరో బర్త్ డే అయితే మంచి సందర్భం అవుతుందనే అభిప్రాయం కొందరు ఫ్యాన్స్ వ్యక్తం చేయడంతో దానికి అనుగుణంగా నిర్ణయం తీసుకునే ఆలోచనలో యువి క్రియేషన్స్ ఉందని లేటెస్ట్ అప్డేట్. అయితే అంత రిస్క్ నిజంగా తీసుకుంటారా అంటే డౌటే. ఎందుకంటే దానికి పలు కారణాలున్నాయి. ఆగస్ట్ 14 జూనియర్ ఎన్టీఆర్ - హృతిక్ రోషన్ వార్ 2 ఉంది. ఖచ్చితంగా డేట్ మిస్ చేయకూడదనే లక్ష్యంతో యష్ రాజ్ ఫిలింస్ పక్కా ప్లానింగ్ తో ముందెకెళ్తోంది. హృతిక్ గాయం వల్ల బ్రేక్ పడినా సరే ఎలాంటి ఇబ్బంది లేదంటోంది. ఇంకోవైపు రజనీకాంత్ కూలికి కూడా అదే తేదీని చూస్తున్నారు. ఒకవేళ వార్ 2 ఫిక్స్ అయితే వారం రెండు వారాలు ఆలస్యంగా అయినా కూలిని బరిలో దిగుతుందని చెన్నై వర్గాల కథనం. ఇది మాములు మల్టీస్టారర్ కాదు. రజనితో పాటు నాగార్జున, అమీర్ ఖాన్, ఉపేంద్రల కాంబో వినగానే హైప్ పెంచుతోంది. తెలుగు వెర్షన్ కే నలభై కోట్ల దాకా రేట్ పలుకుతోందని ఇండస్ట్రీ టాక్. వీటికి తోడు ఆగస్ట్ 15 ది ఢిల్లీ ఫైల్స్ ని తీసుకొస్తున్నారు. స్టార్ క్యాస్టింగ్ లేకపోయినా భారీ ఎత్తున రిలీజ్ ఉంటుంది. వీటి మధ్య విశ్వంభర రిస్క్ చేయడం కంటే సోలో డేట్ చూసుకోవడం బెటర్. ముందు నుంచి ప్రచారం జరుగుతున్నట్టు మే 9 బెస్ట్ అయ్యేది. గ్యాంగ్ లీడర్, జగదేకవీరుడు అతిలోకసుందరి సెంటిమెంట్ కూడా కలిసివచ్చేది.

# శిఖర్ ధావన్ రికార్డును బద్దలు కొట్టే దిశగా రోహిత్ శర్మ!

తొలి అడుగు, : ఈ సీజన్‌లో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా రోహిత్ శర్మ నిలిచాడు. 222 మ్యాచ్‌ల్లో 35.25 సగటుతో 6779 పరుగులు చేసిన తన స్నేహితుడు శిఖర్ ధావన్‌ను రోహిత్ ఈ సీజన్‌లో అధిగమించగలడు. ఐపీఎల్ 2025లో శిఖర్ ధావన్ రికార్డును రోహిత్ శర్మ బ్రేక్ చేసే అవకాశం ఉంది. భారీ ఫీట్ సాధించడానికి హిట్‌మ్యాన్ కేవలం 142 పరుగుల దూరంలో ఉన్నాడు. ఐపీఎల్ 2025 కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈసారి చాలా మంది ఆటగాళ్లు ప్రపంచంలోనే అతిపెద్ద లీగ్‌లో భాగం కాలేకపోతున్నారు. వీరిలో శిఖర్ ధావన్ పేరు కూడా ఉంది. ధావన్ గత ఏడాదే రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే ఐపీఎల్ కెరీర్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా శిఖర్ నిలిచాడు. అయితే ఇప్పుడు ఈ రికార్డును రోహిత్ శర్మ బ్రేక్ చేయగలడు.

ఈ సీజన్‌లో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా రోహిత్ శర్మ నిలిచాడు. 222 మ్యాచ్‌ల్లో 35.25 సగటుతో 6779 పరుగులు చేసిన తన స్నేహితుడు శిఖర్




ధావన్‌ను రోహిత్ ఈ సీజన్‌లో అధిగమించగలడు. ఈ సమయంలో 2 సెంచరీలు కాకుండా, ధావన్ తన పేరు మీద 51 అర్ధ సెంచరీలు చేశాడు. అయితే, ఇప్పుడు ధావన్ రికార్డును బద్దలు కొట్టేందుకు రోహిత్ శర్మ కేవలం 142 పరుగుల దూరంలో ఉన్నాడు. 142 పరుగులు సాధిస్తే రోహిత్.. ధావన్‌ను వెనక్కినెట్టి ఐపిఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన విరాట్ కోహ్లీ తర్వాత రెండవ ఆటగాడు అవుతాడు. ఖూా కెరీర్‌లో ఇప్పటివరకు రోహిత్ శర్మ 257 మ్యాచ్‌లలో 29.72 సగటుతో 6628 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 43 అర్ధ సెంచరీలు నమోదయ్యాయి.

# డబ్ల్యుఎఫ్ఐపై సస్పెన్షన్ ఎత్తివేత



తొలి అడుగు, కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(డబ్ల్యుఎఫ్ఐ)పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. తద్వారా దేశీయ టోర్నమెంట్‌ల నిర్వహణకు, అంతర్జాతీయ టోర్నీలకు జాతీయ జట్ల ఎంపికకు రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు మార్గం సుగమం చేసింది. కాగా డబ్ల్యుఎఫ్ఐకి జరిగిన ఎన్నికల్లో సంజరు సింగ్ నేతృత్వంలోని ప్యా%ు%నెల్ 2023 డిసెంబర్ 21న విజయం సాధించిన విషయం తెలిసిందే. సంజరు సింగ్ డబ్ల్యుఎఫ్ఐ కొత్త అధ్యక్షుడి ఎన్నికైన అనంతరం అండర్-15, అండర్-20 జాతీయ పోటీలను ఉత్తరప్రదేశ్‌లోని గోందాలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణజీయం కేంద్ర ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించింది. రెజ్లర్లు పోటీలకు సిద్ధమయ్యేందుకు సమయం ఇవ్వకుండా ప్రకటన వెలువరించిన కారణంగా కొత్త కార్యవర్గంపై వేటు వేసింది. క్రీడా శాఖ విధి విధానాలను అమలు చేయలేదనే కారణంతో తదుపరి ఆదేశాలు వచ్చేంతవరకు సస్పెన్షన్ అమలులో ఉంటుందని 2023 డిసెంబర్ 24న క్రీడా మంత్రితవ్వశాఖ వెల్లడించింది. అయితే, ప్రస్తుతం దిద్దుబాటు చర్యలు తీసుకున్న కారణంగా డబ్ల్యుఎఫ్ఐపై విధించిన ్సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నిర్ణయించినట్లు క్రీడా మంత్రిత్వశాఖ పేర్కొంది.

# వరల్డ్ పారా అథ్లెటిక్స్‌లో కాంస్యంతో మెరిసిన లలిత

తొలి అడుగు, న్యూఢిల్లీ వేదికగా ప్రారంభమైన ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ 2025 పోటీల్లో తొలిరోజు టి11 విభాగం 1500 మీటర్ల పరుగు పందెంలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన క్రీడాకారిణి కిల్లక లలిత కాంస్య పతకం గెలుచుకోవడం జిల్లాకు గర్వకారణమని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో 20 దేశాలకు చెందిన పారా క్రీడాకారులు పాల్గొన్నారని, గట్టి పోటీలో సైతం అసామాన్య ప్రతిభ కనబరచిన లలిత తానేంటో నిరూపించడమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో విజయనగరం పేరు మారుమోగేలా చేసిందని ప్రశంసించారు. ఈ పతకం మన రాష్ట్ర క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహన్ని నింపిందని, ఇతర విభాగాల్లోనూ ఆమె పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించిన లలితకు జిల్లా కలెక్టర్ డాక్టర్. బి.ఆర్.అంబేద్కర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావులు అభినందనలు తెలియజేసారు.



# ఐపీఎల్‌కు ముందే బిగ్ షాకిచ్చిన బీసీసీఐ?

తొలి అడుగు, : టీం ఇండియా ఆటగాళ్లకు కొత్త కేంద్ర ఒప్పందం రాబోతోంది. దీని కింద వారు వచ్చే ఏడాది పాటు దీజజ×తో ఒప్పందం కుదుర్చుకుంటారు. కొత్త కేంద్ర ఒప్పందంలో అనేక మార్పులను చూడొచ్చు. ఐదుగురు ఆటగాళ్ళు నేరుగా ఎలిమినేట్ కావడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన తర్వాత కూడా, కొత్త ఒప్పందంలో రోహిత్, విరాట్ లను తగ్గించే అవకాశం ఉంది. బీసీసీఐ ప్రస్తుత కేంద్ర ఒప్పందంలో, గ్రేడ్ ఏ ప్లస్‌లో నలుగురు ఆటగాళ్ళు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా ఉన్నారు.టీం ఇండియా ఆటగాళ్లకు కొత్త కేంద్ర ఒప్పందం రాబోతోంది. దీని కింద వారు వచ్చే ఏడాది పాటు దీజజ×తో ఒప్పందం కుదుర్చుకుంటారు. కొత్త కేంద్ర ఒప్పందంలో అనేక మార్పులను చూడొచ్చు. ఐదుగురు ఆటగాళ్ళు నేరుగా ఎలిమినేట్ కావడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన తర్వాత కూడా, కొత్త ఒప్పందంలో రోహిత్, విరాట్ లను తగ్గించే అవకాశం ఉంది. బీసీసీఐ ప్రస్తుత కేంద్ర ఒప్పందంలో, గ్రేడ్ ఏ ప్లస్‌లో నలుగురు ఆటగాళ్ళు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా ఉన్నారు. గ్రేడ్ ఏ ప్లస్ మూడు ఫార్మాట్లలో ఆడే ఆటగాళ్లను చేరుస్తుంటారు. గ్రేడ్ ఎ ప్లస్ ఆటగాళ్లకు బీసీసీఐ నుంచి ఏటా రూ.7 కోట్లు లభిస్తాయి. కానీ, రోహిత్, విరాట్, జడేజా ఇప్పుడు ఒక్కొక్క ఫార్మాట్‌ను విడిచిపెట్టినందున, ఈ ముగ్గురు ఆటగాళ్ళు గ్రేడ్ ఎ ప్లస్ నుంచి బయటపడటం ఖాయంగా భావిస్తారు. కొత్త ఒప్పందంలో వారు గ్రేడ్ ఏ లో భాగమవుతారా లేదా గ్రేడ్ బీ లో భాగమవుతారా అనేది పూర్తిగా బీసీసీ చేతిలో ఉంది. బీసీసీఐ ప్రస్తుత సెంట్రల్ కాంట్రాక్టులో గ్రేడ్ ఏలో మొత్తం ఆరుగురు ఆటగాళ్ళు ఉన్నారు. వారిలో ఆర్. అశ్విన్, మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమీ, కేఎల్ రాహుల్, శుభ్‌మాన్ గిల్, హార్దిక్ పాండ్యా ఉన్నారు. ఈ గ్రేడ్ ఆటగాళ్లకు బీసీసీఐ నుంచి ప్రతి సంవత్సరం రూ.5 కోట్లు లభిస్తాయి. కానీ, ఇప్పుడు రాబోయే కొత్త ఒప్పందంలో ఇప్పటికే పదవీ విరమణ చేసిన అశ్విన్‌ను విడిచిపెట్టనున్నారు. అదే సమయంలో, సిరాజ్ ను పదవి నుంచి తొలగించడం కూడా చూడొచ్చు. అంటే వారు గ్రేడ్ ఏ నుంచి గ్రేడ్ బీకి మారవచ్చు. అదేవిధంగా బీసీసీఐ ప్రస్తుత సెంట్రల్ కాంట్రాక్ట్‌లో అంటే గ్రేడ్ బీలో ఐదుగురు ఆటగాళ్ళు, గ్రేడ్ సీలో



మొత్తం 15 మంది ఆటగాళ్ళు ఉన్నారు. ఈ రెండు గ్రేడ్‌లలోని మొత్తం నలుగురు ఆటగాళ్లను కొత్త ఒప్పందం నుంచి తొలగించే అవకాశం ఉంది. జట్టు నుంచి తప్పుకున్న నలుగురు ఆటగాళ్ళు సీ గ్రేడ్‌కు చెందినవారు. వారి పేర్లు కేఎస్ భరత్, అవేష్ ఖాన్, రజత్ పాటిదార్, జితేష్ శర్మ. బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టులో గ్రేడ్ బి ఆటగాళ్లకు రూ.3 కోట్లు, గ్రేడ్ సి ఆటగాళ్లకు రూ.1 కోటి చొప్పున జీతం లభిస్తుంది.

ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, బీసీసీఐ జారీ చేయబోయే టీం ఇండియా కొత్త కేంద్ర కాంట్రాక్టులో చోటు పొందే ఆటగాళ్ళు ఎవరు? ఆ ఆటగాళ్లలో, గిల్, యశస్వి, అక్షర్ పదోన్నతి పొందుతున్నట్లు చూడొచ్చు. దీని అర్థం వారి గ్రేడ్‌ను మార్చడం ద్వారా వారు భారీగా ఆర్థిక ప్రయోజనాలను పొందవచ్చు. గిల్‌ను ఏ నుంచి ఏ ప్లస్ గ్రేడ్‌లలో ఉంచవచ్చు. యశస్వి, అక్షర్ గ్రేడ్ బీ నుంచి గ్రేడ్ బీ కి పదోన్నతి పొందవచ్చు.